క్లుప్తంగా

20న బీఆర్‌ఎస్ సమావేశం

బాలానగర్: ఈ నెల 20వ తేదిన బీఆర్‌ఎస్ ఉమ్మడి బాలానగర్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమం చేపడుతున్నట్లు మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రావు బుధవారం పేర్కొన్నారు. సమావేశానికి ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

ఇసుక టిప్పర్ సీజ్

నవాబుపేట: మండల పరిధిలోని పత్తేపూర్ గేట్ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు. బుధవారం తెల్లవారుజామున ఉదండాపూర్ ప్రాజెక్టు నుంచి చాకలిపల్లికి టిప్పర్ వెళ్తుండగా పెట్రోలింగ్ బృందం పట్టుకున్నట్లు వివరించారు. డ్రైవర్ పరారు కావటంతో.. టిప్పర్ నంబర్ ఆధారంగా యజమాని రాజేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

ఎమ్మెల్యేకు ఘనసన్మానం



కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్ గణపతిరాయుడి చెరువును రిజర్వాయర్‌గా మార్చేందుకు జనజాతరలో సీఎం రేవంత్‌దృష్టికి దృష్టికి తీసుకెళ్లిన నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డికి నాయకులు ధన్యవాదాలు తెలిపారు. కోయిల్‌కొండలో బుధవారం ఆమెను ఘనంగా సన్మానించారు. కాగా త్వరలోనే మంజూరు అయ్యేందుకు కృషి చేస్తానని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మల్లికార్జున్‌గౌడ్, వెంకటరెడ్డి, గోపాల్, మల్లేష్, రవి తదితరులు ఉన్నారు.

ఎంపీటీసీ సభ్యుడిపై దాడి హేయమైన చర్య

మహబూబ్‌నగర్ రూరల్: అడ్డాకుల మండలం బలీదుపల్లి ఎంపీటీసీ సభ్యుడు గణేష్‌పై అకారణంగా దాడి చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని.. లేనిపక్షంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు దయాకర్, గణేష్, చందు, కృష్ణ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేద్దాం

మహబూబ్‌నగర్ రూరల్: ఇందిరమ్మ కాలం నుంచి మాదిగలను కంటికి రెప్పలా కాపాడిన పార్టీ కాంగ్రెస్ అని ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలంతా కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య నాయకత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

హన్వాడ: షేక్‌పల్లి మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌నాయక్ బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. మండలంలో సీనియర్ నాయకుడిగా గుర్తింపు ఉన్న ఆయన మరణించిన విషయం తెలుసుకున్న నాయకులు స్వగ్రామం ఎల్లంబాయితండాకు వెళ్లారు. ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, ఎంపీపీ బాల్‌రాజు, నాయకులు రమణారెడ్డి, తదితరులు బాధితకుటుంబాన్ని పరామర్శించారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

నారాయణపేట రూరల్: సామాజిక సేవా కార్యక్రమాలు చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆర్టీసీ డీఎం లక్ష్మీసుధ, టౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని జై భవాని ఫ్రూట్ మర్చంట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రంలో బుధవారం పచ్చడి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తన తండ్రి కీశే శివసింగ్ జ్ఞాపకార్థం వారి కుమారుడు చందుసింగ్ సొంత డబ్బులతో ప్రయాణికుల దాహార్తిని తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. అనంతరం వారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఆంజనేయులు, ఆర్టీసీ ఎంఎఫ్ చందునాయక్, రాజేష్‌కుమార్, ఆవుటి రాజశేఖర్, బాబు, శ్రీనివాస్, లింగం, పాషా పాల్గొన్నారు.





టీచర్స్‌కాలనీ రామాలయంలో కల్యాణానికి హాజరైన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి



దేవరకద్రలో కల్యాణంలో పాల్గొన్న బీజేపీ అభ్యర్థి డీకే అరుణ



ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో ఆలయ కమిటీ సభ్యులు



జడ్చర్లలో హారతి ఇస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



సీతారాముల వారికి తలంబ్రాలు పోస్తున్న భక్తులు



జిల్లాకేంద్రంలో వేడుకల్లో పాల్గొన్న భక్తులు



రాంమందిర్‌చౌరస్తా రామాలయంలో హాజరైన భక్తులు



రాజాపూర్‌లో ..

రమణీయం.. రాములోరి కల్యాణం



అయోధ్యనగర్‌లో ఎమ్మెల్యే యెన్నం, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి



దమగ్నాపురంలో కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దంపతులు



సీతారాముల వారి విగ్రహాలు



కర్వెనలో..

సాక్షినెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాలు, మండల కేంద్రాలు, మున్సిపాలిటీల పరిధిలో బుధవారం సీతారాముల కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బాలాజీనగర్‌లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కాలనీ అధ్యక్షుడు సనాతన బాల్‌రాజు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, దయాకర్, బి.అశోక్‌బాబు, కొత్త హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

- మహబూబ్‌నగర్ రూరల్ పరిధిలోని అన్ని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో వేడుక నిర్వహించారు. గాజులపేటలో బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఎగ్గని నర్సిములు, విష్ణువర్ధన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, పోతుల రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- జడ్చర్లలోని పాతబజార్ హనుమాన్‌దేవాలయం , లక్ష్మీనగర్, వాసవీకన్యకాపరమేశ్వరి, సకలదేవతల ఆలయం తదితరల చోట్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి డీకే అరుణ ఆయా చోట్ల వేడుకల్లో పాల్గొన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు.
- భూత్పూర్‌లో పూజారులు మంజునాథ, జయకుమార్ శర్మ, వెంకట్ శర్మ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. రాజాపూర్‌తో పాటు రంగారెడ్డిగూడ, మల్లేపల్లి, గుండ్లపొట్లపల్లి, తిర్మలాపూర్, రాయపల్లి, కుచ్చర్‌కల్, చొక్కంపేట్ తదితర గ్రామాల్లో శ్రీరామనవమి ఘనంగా నిర్వహించారు.
- నవాబుపేట పరిధిలోని అన్ని గ్రామాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి.
- వెన్నాచేడ్ బండమీది రామస్వామి ఆలయంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. బీజేపీ ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప, అంతర్‌గాని రాములు, కోడూరు దస్తయ్య, వడ్ల బాలు వేడుకల్లో పాల్గొన్నారు. అదేవిధంగా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని సన్మానించారు. మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ బాలయ్య, మాజీ ఎంపీపీ శాంతి పాల్గొన్నారు. అదే విధంగా బీజేపీ నాయకుడు ఏవీ రాములు, మిట్ట పరమేశ్వర్, సామ్యారెడ్డి హాజరయ్యారు.
- మహమ్మదాబాద్ పరిధిలోని వేడుకల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ కమతం శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, డీసీసీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.
- చిన్నచింతకుంట పరిధిలో వేడుకల్లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.
- అడ్డాకుల, మూసాపేట మండలాల్లో బుధవారం శ్రీరామ నవమి వేడుకల్లో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.
- దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వేడుకల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం వారు ఆమెను ఘనంగా సన్మానించారు. నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ కొండ ప్రశాంత్‌రెడ్డి, మండల నాయకులు ఉన్నారు.
- హన్వాడ పరిధిలో ఇబ్రహీంబాద్, కొత్తపేట, వేపూర్ గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు.
- బాలానగర్ పరిధిలో మోతీఘనపూర్‌లో, గుండేడ్, ఉడితాల్య, పెద్దరేవల్లి, కేతిరెడ్డిపల్లి, హేమాజీపూర్ తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు.
- చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి ఆలయం, కొకుంట్ల, పేరూర్, పుట్టపల్లి తదితర గ్రామాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు.





జిల్లాకేంద్రంలో భక్తితో నమస్కరిస్తున్న యువతులు, మహిళ



అడ్డాకుల మండలం బలీదుపల్లిలో..



మోతీఘనపూర్‌లో..



మహమ్మదాబాద్‌లో..



కొత్తపేటలో..



జడ్చర్ల పాతబజార్ హనుమాన్ ఆలయంలో ..



నవాబుపేటలో ..



వెన్నాచేడ్‌లో..

వైభవంగా సాగుతున్న అఖండ భజనలు



సప్తాహ మహోత్సవాలలో భజన చేస్తున్న చల్లా వంశీచంద్‌రెడ్డి దంపతులు

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆలయంలో సప్తాహ మహోత్సవాల్లో భాగంగా నాలుగు రోజులుగా వైభవంగా అఖండ భజనలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో బుధవారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి సతీసమేతంగా పాల్గొన్నారు. దేవస్థానం వారు ఆయనకు ఘనస్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా చల్లా దంపతులు అడుగుల భజనలో పాల్గొన్నారు. అదేవిధంగా ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయం, వాసవీ కన్యాకాపరమేశ్వరి దేవాలయంలో కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

మోదీ యుగపురుషుడు



మాట్లాడుతున్న వెన్న ఈశ్వరప్ప

గండేడ్: ప్రధాని మోదీ యుగపురుషుడని తిరిగి ఆయన అధికారంలోకి రావడం ఖాయం అని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏవీ రాములు పేర్కొన్నారు. బుధవారం పగిడ్యాల్, వెన్నాచేడ్‌కు చెందిన పలువురు బీజేపీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టడమే కాక దేశరక్షణలో కీలక పాత్ర పోషించారని అన్నారు. చేవేళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మచ్చలేని నాయకుడన్నారు. ఆయనను గెలిపించాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందన్నారు. ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించాలన్నారు. కార్యకర్తలు సైనికుల్లాగా పనిచేయాలని వివరించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు సౌమ్యారెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సోదరి డాక్టర్ మీర, మండల అధ్యక్షుడు విజయ్‌రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బాలయ్య, ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, బీజేవైఎం అధ్యక్షుడు రవీంద్ర, ప్రధాన కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళి

జడ్చర్ల టౌన్: సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి పురస్కరించుకుని బుధవారం ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి జిల్లా రజక ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జంగయ్య ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాధాకృష్ణన్ సేవలను గుర్తుకు చేశారు. వర్ధంతిని సైతం ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని జంగయ్య కోరారు. కార్యక్రమంలో సంస్కార భారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ, రజకసంఘం నాయకులు యాదగిరి, ధనాల వెంగళ్‌రావు, రమేష్, శ్రీను, జయరాం పాల్గొన్నారు.



సర్వేపల్లి విగ్రహం వద్ద నాయకులు

కల్యాణానికి విగ్రహాల అందజేత



రాజాపూర్: రాయపల్లిలో ఏటా సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు పంచలోహ విగ్రహాలను బుధవారం గ్రామానికి చెందిన పలువురు అందజేశారు. అల్లాపురం వెంకట్‌రెడ్డి, ఆంజనేయుడి విగ్రహం, కిష్టారం మల్లేష్‌గౌడ్, సీతాదేవి విగ్రహం, రాముడి విగ్రహం వడ్ల రాములు, లక్ష్మణుడి విగ్రహాన్ని సూరిబాబుగౌడ్ ఆలయ కమిటీకి అందజేశారు. నూతనంగా నిర్మించిన శివాలయ గోపురంపై కలశాన్ని పాలెం సంజీవయ్యగౌడ్ బహుకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పుల్లయ్య యాదవ్, సభ్యులు కావలిరవి, అల్లాపురం రాంరెడ్డి తదితరులు దాతలను అభినందించారు.

సరస్వతి విద్యాపీఠం ఆవిర్భావ దినోత్సవం



జడ్చర్ల టౌన్: పట్టణంలోని సరస్వతి శిశు మందిరంలో బుధవారం సరస్వతి విద్యాపీఠం ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా పాఠశాల అధ్యక్షురాలు చిగుళ్లపల్లి పద్మలీల మాట్లాడుతూ సరస్వతి విద్యాపీఠం ఆవిర్భావం తరువాత సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు అవకాశం కలిగిందన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అదే విధంగా శ్రీరామనవమి వేడుకలు జరిపారు. విద్యార్థులు సీతారాముల చరితను తెలియజేసే ప్రదర్శన అలరించింది. ప్రధానాచార్యులు వెంకటయ్య, ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కరువు



జమాల్‌పూర్‌లో ఉపాధిపనులు చేస్తున్న కూలీలు

- ఎండలతో తల్లడిల్లుతున్న ఉపాధి కూలీలు
- పట్టించుకోని అధికారులు

కోయిల్‌కొండ: మండలంలో గడిచిన వారం రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఉపాధిహామీ కూలీలు ఎండలకు తాళలేక తల్లడిల్లుతున్నారు. పని ప్రదేశంలో కనీససౌకర్యలు కల్పించడంలో సంబంధిత అధికారులు విఫలమవుతుండడంతో కూలీలకు అవస్థలు తప్పడం లేదు. తప్పనిసరి పరిస్థితిలో ఎండలో పనులు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 44 గ్రామపంచాయతీల్లో దాదాపు 12, 562 మందికి జాబ్‌కార్డులు ఉన్నాయి. కాగా ప్రస్తుతం ఆయా గ్రామాల్లో దాదాపు 8 వేల మందికి పైగా ఉపాధి పనులు చేస్తున్నారు. కాగా ప్రస్తుతం ఎండల నేపథ్యంలో కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత సంబంధిత సిబ్బందిపై ఉంది. అందులో భాగంగా తాగునీరు, టెంట్ వసతి, ఓఆర్‌ఎస్ పాకెట్ల పంపిణీ వంటివి చేపట్టాల్సి ఉంది. కానీ మండల పరిధిలో ఏ పనిప్రదేశం వద్ద కూడా అమలుకు నోచుకోవడం లేదు. దీంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే కూలీలకు ప్రమాదవశాత్తు ఎదైనా గాయమైనా, వడదెబ్బ తగిలినా ప్రథమ చికిత్స చేయడానికి వీలుగా కిట్లను అందుబాటులో ఉంచాల్సి ఉన్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు స్పందించి పని ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించాలని ఉపాధికూలీలు కోరుతున్నారు.

వసతులు లేవు



ఉపాధిహామీ పనుల వద్ద కూలీలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. తాగునీరు, టెంట్‌లు వంటివి కూడా ఏర్పాటు చేయడం లేదు. ఎండలు మండిపోతున్నా జీవనోపాధి కోసం అలాగే పనులు చేస్తున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాల్సిన అవసరముంది.

– నరేష్, ఉపాధి కూలీ, లింగుపల్లి

చర్యలు చేపట్టాలి



గ్రామాలలో ఉపాధిహామీ కూలీలకు కనీస వసతులు కూడా అధికారులు ఏర్పాటు చేయడంలేదు. అంతేకాక గత 8 వారాలుగా కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించలేదు. ఎన్నో ఇబ్బందుల మధ్య కూలీలు జీవనోపాధికోసం తప్పనిసరి పరిస్థితుల్లో అలాగే పనులు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలి. అదేవిధంగా పనిదినాలను సైతం పెంచాలి.

– నర్సిములు, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

సౌకర్యాలు కల్పిస్తున్నాం

మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఉపాధి పనుల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పని ప్రదేశాల్లో కూలీలకు ఓఆర్‌ఎస్ పాకెట్లు, టెంట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని గ్రామపంచాయతీ అధికారులకు సూచించాం. అదేవిధంగా గ్రామాల్లో పర్యటిస్తూ వసతుల కల్పనకు కృషిచేస్తున్నాం.

– నర్సయ్య, ఏపీఓ, కోయిల్‌కొండ